క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వెదురుకుప్పం: తిరుమలయ్యపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధినేత బండి చిరంజీవిరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానంగా కంటి చూపు మందగించడం, దగ్గర, దూరపు చూపు, ఇతర సమస్యలకు సంబంధించి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైతే ఆపరేషన్ కూడా చేస్తారని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

వెదురుకుప్పం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, కార్యదర్శులకు సోమవారం నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్డీ పురుషోత్తం తెలిపారు. వెదురుకుప్పం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో 19 నుంచి 21 వరకు మూడు రోజులపాటు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. 25 పంచాయతీలకు చెందిన గ్రామ కార్యదర్శులు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని కోరారు.

బోధన సామగ్రివితరణ


నోటు పుస్తకాలు అందిస్తున్న దాత చంద్రయ్య

విజయపురం: మండలంలోని మల్లారెడ్డికండ్రిగ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రిటైర్డ్ హెచ్‌ఎం చంద్రయ్య, ఉపాధ్యాయుడు దొరస్వామి శనివారం విద్యా సామగ్రి వితరణ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వం పాఠశాలలోనే చేర్చాలని దాత చంద్రయ్య కోరారు. అన్ని దానాలు కంటే విద్యాదానం ఎంతో గొప్పదన్నారు. ఇంకా అవసరమైన బోధన సామగ్రి అందించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు.

పాఠశాల కమిటీ ఎంపిక

నింద్ర: మండలంలోని కొప్పేడు దళితవాడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కమిటీ ఎన్నికలు వాయిదా పడడంతో శనివారం ఎన్నికలు నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్‌గా టి.సుమ, వైస్ చెర్మన్‌గా సౌందర్య ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఎన్నికైన కమిటీ సభ్యులు మట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుడికి నివాళి


సురేష్‌బాబు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

నింద్ర: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు సురేష్ బాబు గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. శనివారం ఉన్నత పాఠశాలలో నింద్ర, విజయపురం పాఠశాలలకు చెందిన గణిత ఉపాధ్యాయుల సీఆర్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మృతి చెందిన గణిత ఉపాధ్యాయుడు సురేష్‌బాబు చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు వసుమతి, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ గ్రామ కార్యదర్శిగా సంపూర్ణ



విజయపురం: మండలంలోని బూచివానత్తం పంచాయతీ కార్యదర్శి సంపూర్ణ శనివారం ఉత్తమ అవార్డు అందుకున్నారు. డీపీఓ లక్ష్మి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. పంచాయతీ అభివృద్ధిలో ఆమె చేసిన కృషికి ఫలితంగానే అవార్డు వరించిందని ఎంపీడీఓ చంద్రమౌళి, మండల పరిషత్ సిబ్బంది అభినందించారు.

ఇందిరమ్మ కాలనీలో వసతులు కల్పించండి


అధ్వానంగా ఉన్న వీధి

నగరి: టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు లేవని, స్థానికులు దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారని, వారికి వసతులు కల్పించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇందిరమ్మ కాలనీలో వారు పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు వీధులు బురదమయమై కాలువలు లేక మురుగు రోడ్డుపై పారుతుండాన్ని, నీటిపైపులు సక్రమంగా లేకపోవడం, వీధి దీపాలు లేకపోవడాన్ని గుర్తించారు. ఇన్ని సమస్యలు ప్రజలు ఎదుర్కొంటుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో ఈ ప్రాంతం ముంపునకు గురవుతోందని నడుము వరకు నీరు నిలిచి రంగు వ్యర్థాలతో మురుగునీరు కలిసిపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారుతోందన్నారు. పలువురు కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు రమేష్‌నాయుడు, మునికృష్ణమ నాయుడు, మోహన్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆ బావి నీరే.. అమృతం


కేశవపురంలో ఉన్న బావి వద్ద నీళ్లు తోడుకుంటున్న మహిళలు

ఆరోగ్యంగా ఉండాలంటే మొదట పరిశుభ్రమైన నీరు తీసుకోవాలి. అందుకే ప్రస్తుతం పట్టణం నుంచి పల్లె వరకు ఎక్కడ చూసినా మినరల్ వాటర్ పేరు వినిపిస్తుంది. ప్రధాన మంత్రి సమావేశం నుంచి గ్రామ స్థాయిలో జరిగే బర్త్‌డే ఫంక్షన్ వరకు మినరల్ వాటర్ బాటిల్స్ ఉపయోగిస్తున్నారు. అయినా కొత్త కొత్త వ్యాధులు, రోగాలతో ప్రజలు బాధపడుతున్నారు. అయితే విజయపురం మండలం కేశవపురం ఆదిఆంధ్రవాడలో నేటికి 70 ఏళ్లుగా బావి నీటినే తాగుతూ ఆరోగ్యంగా ఉంటున్నారు. – విజయపురం

- 70 ఏళ్లుగా బావి నీళ్లే తాగుతున్న గ్రామస్తులు
- కేశవపురం ఆదిఆంధ్రవాడలో అద్భుతం

విజయపురం మండలం, కేశవపురం ఆదిఆంధ్రవాడలో సుమారు 30 కుటుంబాలు ఉన్నాయి. వందేళ్లకు ముందు రెండు కుటుంబాలతో ఏర్పడ్డ ఈ ఊరు కాల క్రమేణా పెరిగింది. అప్పట్లో ఆ ఊరు వారు చుట్టు పక్కల ఉన్న గుంట, చెరువు నీళ్లు తాగేవారు. 1965లో అప్పటి ప్రభుత్వం ఊరులో ఓ బావి తవ్వించింది. అప్పటి నుంచి నేటి వరకు ఆ బావి నీళ్లే తాగుతూ ఆరోగ్యంగా ఉంటున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతే కాకుండా ప్రస్తుతం ఉన్న యువకులు కూడా మినరల్ వాటర్ తాగకుండా బావి నీళ్లే తాగుతున్నారు. ఆ నీళ్లు తాగడంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు రావడం లేదు. ఎవ్వరికైనా శరీరం ఎక్కువ వేడి చేస్తే ఆసుపత్రికి వెళ్లరు. ఆ బావిలో నీళ్లు ఒక గ్లాసు తాగితే గంటలోపు శరీరం చల్లబడుతుందని గ్రామస్తులు చెబుతున్నారు.

ఎలాంటి అనారోగ్య సమస్య లేదు



నా చిన్నతనం నుంచి బావి నీళ్లే తాగుతున్నాం. ఇప్పటి వరకు ఎలాంటి దీర్ఘకాల సమస్యలు ఏమీ లేవు. వేసవిలో ఈ నీళ్లు తీసుకుంటే వేడి చేయడం లేదు. చల్లగా బాగుంటుంది. ఎవ్వరికైనా వేడి చేస్తే మా బావిలో నీళ్లు తీసుకుంటే వెంటనే చల్లబడుతుంది. కుశస్థలి నది నుంచి తాగు నీరు సరఫరా చేసినా, మేము బావిలో ఉన్న నీళ్లు మాత్రమే తాగుతున్నాం.
– వెంకటేశులు, కేశవపురం

బావి నీళ్లే మాకు మినరల్ వాటర్



మేము ఏదైనా పని నిమిత్తం, వివాహ కార్యక్రమాలకు బయటకు వెళ్తే మినరల్ వాటర్ తాగినా దాహం తీరదు. మా ఊరులో ఉన్న బావిలో నుంచి నీళ్లు తీసుకుంటే మాకు ఆనందంగా ఉంటుంది. బావి తవ్వి 70 ఏళ్లు అయినా నేటికీ ఈ నీటి వలన మాకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాలేదు. మా ఊరులో ఉన్న అన్ని కుటుంబాలు ఈ నీటినే వాడుతున్నాం.
– గోపి, కేశవపురం

తెప్పలపై శ్రీకోదండరాముని చిద్విలాసం


ఊరేగుతున్న శ్రీకోదండరామ స్వామివారు

కార్వేటినగరం: శ్రీసంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో టీటీడీ ఆధ్వర్యంలో శనివారం తెపోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శ్రీసీతా, లక్ష్మణ సమేత శ్రీకోదండరాముల వారిని వేకువ జామున సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన తదితర నిత్యకైంకర్యాలను నిర్వహించారు. అనంతరం స్వామివారి మూల విరాట్‌ను పట్టువస్త్రాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 9 గంటలకు శ్రీసీతాకోదండరాముల వారి ఉత్సవ విగ్రహాలతోపాటు లక్ష్మణ, ఆంజనేయ స్వామివారి విగ్రహాలకు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చారు. పుర వీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సంస్థానాధీశులు నిర్మించిన స్కంధ పుష్కరిణిలో టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెప్పలపై స్వామివారిని ప్రతిష్ఠించి మేళ, తాళాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారు తెప్పపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సురేష్‌కుమార్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను విడనాడాలి


మంటను మండిస్తున్న యుగంధర్

పాలసముద్రం: తిరుమలరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పర్యావరణ విభాగం కన్వీనర్ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు యుగంధర్ శనివారం మూఢనమ్మకాలను తొలగించడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మూడు ప్రశ్నల ద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలని కోరారు. నీళ్లను పెట్రోల్‌గా మార్చడం, మంటను మింగడం, తాడు ముక్కలను అతికించడం, నోటి నుంచి లింగాలు తీయడం తదితర మ్యాజిక్‌లను చేశారు. వాటిలో ఉన్న మర్మాలను, సైన్స్ అంశాలను విద్యార్థులకు వివరించారు. ఎంఈఓ గిరిజ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచడానికి ఈ వండర్ సైన్స్ కార్యక్రమం ఉపయోగ పడుతుందన్నారు. గారడీలలో మెళకువలే తప్ప మాయామంత్రం లేదని, ప్రశ్నకు నిలిచేదే వాస్తవమని తెలిపారు. కార్యక్రమంలో టీచర్లు వాసు, శ్రీనివాసులు, మురు గదాస్, వెంకటేస్, సుబ్బులక్ష్మి, ఆనందయ్య పాల్గొన్నారు.

వైభవంగా మహా రథోత్సవం

- గరుడ వాహనంపై శ్రీకృష్ణుడి చిద్విలాసం
- దుర్యోధన వధతో పాండవుల విజయోత్సవం
- ద్రౌపదీదేవి బ్రహ్మోత్సవాలతో పులకించిన పుత్తూరు


భక్త జన సందోహం మధ్యన మహా రథోత్సవం

పుత్తూరు: శ్రీద్రౌపదీదేవీ సమేత శ్రీధర్మరాజుల స్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. చివరి అంకంలోని రెండో రోజైన శనివారం విజయోత్సవాన్ని చాటుతూ పాండవులు నిర్వహించిన మహా రథోత్సవం మహాభారతాన్ని కనుల ముందు ఆవిష్కరించింది. గజ, తురగ, పదాతి దళాలు వెంట నడువగా, మంగళ వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల నడుమ, ముందు భాగాన శ్రీకృష్ణ రథం, వెనక మహా రథోత్సవం అశేష భక్తజనం మధ్యన వైభవంగా సాగింది. 40 అడుగుల మహా రథానికి ఇరువైపులా వందలాది మంది భక్తులు గోవింద.. గోవిందా.. అంటూ భక్తి పారవశ్యంతో లాగుతుంటే పట్టణ వీధులు జనసంద్రమయ్యాయి. ఈ అద్భుత దృశ్యాన్ని వీక్షించడానికి తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చా. ఈ క్రమంలో ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల ప్రత్యేక అర్చకులు హిమాచలంబాబు, మోహన్ ఆధ్వర్యంలో మంచినీళ్ల గుంట నుంచి సంరక్షకుడిగా పోతురాజు ముందు నడుస్తుండగా గెరిగ ఆలయానికి చేరుకొంది. గెరిగ నీటితో స్వామి, అమ్మవార్లకు అభిషేకం చేశారు. అనంతరం శ్రీద్రౌపదీదేవి సమేత ధర్మరాజు స్వామివారికి విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం 11 గంటలకు గరుడ వాహనంపై శ్రీకృష్ణ భగవానుడు రాయబారం కోసం తరలివెళ్లే ఘట్టం భక్తులను ఆకట్టుకొంది. శ్రీకృష్ణుడికి అడుగడుగునా మంగళ హారతులిచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు మేదర సంఘం ఆధ్వర్యంలో భీముడు దుశ్శాసనుని వధించిన రక్తంతో ద్రౌపదీదేవి కురులను తడిపే ఘట్టం అందరినీ అలరించింది. అనంతరం దుర్యోధనుడ్ని సంహరించడం, విజయోత్సవంతో పాండవులు రథాన్ని అధిరోహించే ఘట్టాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పుత్తూరు పట్టణ కమ్మ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో రథంపై విహరించిన ద్రౌపదీదేవి సమేత పాండవ రాజులు ఆలయానికి చేరుకున్నారు. మహారథం ముందు శ్రీకృష్ణ రథంపై పాండవుల వేషధారణ, విజయోత్సవ విన్యాసాలు అందరినీ అలరించాయి. కార్యక్రమాలను సాళ్వాకం వంశీకులైన ఆలయ కోవిల్‌కార్లు ఏలుమలై మొదలి, నటరాజ్ మొదలి, గోపి మొదలి, వెంకటేష్ మొదలి, పార్థసారథి మొదలి, కుప్పుస్వామి మొదలి పర్యవేక్షించారు.

నేడు అగ్నిగుండ ప్రవేశం

ఉదయం 6 గంటలకు గెరిగ ఊరేగింపు, 9 గంటలకు కల్పవృక్ష వాహనం, 10 గంటలకు ఉత్సవం, సాయంత్రం 6 గంటలకు అగ్నిగుండ ప్రవేశం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

వైఎస్‌ఆర్ సీపీ నాయకుడికి పరామర్శ


నవీన్‌కుమార్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం): వైఎస్‌ఆర్ సీపీ సీనియర్ నాయకుడు, మండల యువత అధ్యక్షుడు నవీన్‌కుమార్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి బలిజపల్లి గ్రామానికి వెళ్లి పరామర్శించి, యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం మాట్లాడుతూ కార్యకర్తలకు వైఎస్‌ఆర్ సీపీ అండగా ఉంటుందని, పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన కార్యకర్తలను ఆదుకోవడానికి జగనన్న ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని తెలిపారు. గతంలో పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు, నాయకులకు ఎప్పుడూ అండగా ఉంటూ కంటికి రెప్పలా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, దూది మోహన్, కృష్ణారెడ్డి, జయచంద్రారెడ్డి, లక్ష్మీపతి, ఆర్.సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

ఘనంగా ప్రదోష కాల పూజలు



వెదురుకుప్పం: డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోష కాల పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివుడు, నందీశ్వరులకు ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు వేకువజామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి భక్తి ప్రపత్తులతో పూజలు చేశారు. సాయంత్రం ప్రదోష పూజలు నిర్వహించారు. నందీశ్వరునికి పాలు, పెరుగు, పుసుపుకుంకుమ, నారికేళ జలంతో అభిషేకించారు. సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో నందీశ్వరుడిని అలంకరించి పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. శని త్రయోదశి సందర్భంగా శనీశ్వరుడికి తైలాభిషేకం చేసి పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయం ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయ స్వామికి పూజలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. శనివారం ఐకేపీ కార్యాలయంలో క్రిష్ణజమ్మపురం యూనిట్‌లోని గ్రామ సంఘ అధ్యక్షులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. పుష్ప మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో చెరకు సాగు చేయాలని సూచించారు. వచ్చే బెల్లంను టీటీడీ తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతి ప్రకారం విత్తనం నుంచి విత్తడం వరకు ద్రవ, ఘన జీవామృతం, కషాయాలతో పండించడంపై అవగాహన కల్పించారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్‌పై వివరించారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, దానిని ఏవిధంగా తయారు చేయాలో తెలుసుకోవాలని తెలిపారు.


మాట్లాడుతున్న ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప

కరాటే పోటీల్లో నగరి విద్యార్థుల ప్రతిభ


బహుమతులు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్

నగరి: తమిళనాడులోని పోలూరులో శుక్రవారం నిర్వహించిన కరాటే పోటీల్లో నగరి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఆర్‌కే కరాటే అకాడమీ తరఫున కరాటే మాస్టర్ రాజ్‌కోటి ఆధ్వర్యంలో విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాల్గొన్న విద్యార్థుల్లో ఏడుగురు విద్యార్థులు ప్రథమ బహుమతిని, ఐదుగురు విద్యార్థులు ద్వితీయ బహుమతిని, నలుగురు విద్యార్థులు తృతీయ బహుమతిని కైవసం చేసుకున్నట్లు కరాటే మాస్టర్ తెలిపారు.

వైద్యులపై దాడులు నశించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

నగరి: వైద్యులపై దాడులకు వ్యతిరేకంగా శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి ఫ్లెక్సీలు చేతబట్టి నిరసన వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ కోల్‌కతాలోని ఆర్‌జీకార్ బోధనాస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా ప్రకంపనలు రేపిన విషయం విదితమే. ఇలాంటి ఆటవిక చర్యకు పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని సమ్మెకు దిగుతున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) కీలక పిలుపునిచ్చిన నేపథ్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రి వైద్యులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి మాట్లాడుతూ కోల్‌కతాలోని ఆర్జీకార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో ఎందరికో వైద్యసేవలు అందిస్తూ వారి ప్రాణాలు కాపాడిన 31 ఏళ్ల పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య జరిగిందంటే బాధపడాల్సిన అంశమన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సం జరుపుకుంటున్న తరుణంలో ఒక వైద్యురాలు ఇలాంటి పరిస్థితికి లోనుకావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. వైద్యురాలిగా కాదు ఆమెను ప్రతి ఒక్కరు వారి ఇంటి ఆడబిడ్డగా భావించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి ఈ చర్యకు పాల్పడిన మానవ మృగాలను కఠినంగా శిక్షించాలన్నారు. వైద్యులకు రక్షణ కల్పించే కఠినమైన చట్టాలు అమల్లోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంవో కార్తీక్, వైద్యులు, నర్సింగ్ సూపరింటెండెంట్, వైద్యసిబ్బంది, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారం అత్యంత బాధాకరం

విజయపురం: శిక్షణ పొందుతున్న వైద్యవిద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇది చాలా బాధాకరమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సోమశేఖర్ అన్నారు. కోల్‌కతాలోని ఆర్.జి.కార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్ణయం మేరకు శనివారం మధ్యాహ్నం ఆసుపత్రి ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ట్రైనీ డాక్టర్‌ను దారుణంగా అత్యాచారం చేసి చంపిన నిందితులను త్వరలో పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమని, హంతకుడికి ఉరి శిక్ష వేయాలని కోరారు. వైద్యులు దేవుళ్లతో సమానమని, అలాంటి వైద్యులకే రక్షణ లేకుండా పోయిందన్నారు. ఈ సంఘటన దేశం మొత్తాన్ని ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు.

నిందితులను శిక్షించాలి

పాలసముద్రం: జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించాలని శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్య సిబ్బంది నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ కోల్‌కతాలో 31 ఏళ్ల జూనియర్ డాక్టర్‌ని అత్యాచారం, హత్యపై చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


విజయపురం : నిరసన తెలుపుతున్న వైద్యులు, సిబ్బంది


ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఎదుట నిరసన